# 10. స్వప్నలిపి లో చేరని కవితలు

1. విప్లవం
2. అస్థిపంజరం
3. ప్రతీకారం
4. నవజగత్తు నిర్మిద్దాం
5. నవ్యగీతాలు
6. స్వాగతగీతం
7. సూర్యుని ఆత్మహత్య
8. కుశలప్రశ్న
9. న్యూస్‌రీల్
10. జెండాలకు కన్నీళ్ళులేవు
11. కొత్త సంవత్సరం

# 1. విప్లవం

మండినగుండెల్లో నిరాశానిశ్వాసాలు
మానవ జీవిత విషాద వియత్తలంలో
కారుమబ్బులై కమ్ముకుంటున్నాయి
ఎండిన గొంతుల్లో ఆకలి ఆర్తనాదాలు
మానవజీవిత విషాద వియత్తలంలో
మేఘాల గర్జనలై వినబడుతున్నాయి
పీడితహృదయంలోరగుల్కొన్నక్రోధాగ్నికీలలు
మానవజీవత విషాద వియత్తలంలో
మెరుపుల ఆశాజ్వాలికలై వెలుగుతున్నాయి

ఆ వైప్లవ్యపు తుఫాను ప్రళయంలో
కారుమేఘాల గంభీర గర్జనలో
ఇలాతలం అట్టడుగున
అనాదిగా అణగియున్న
ప్రతీకార ప్రళయాగ్నిగుండం
ఫెళఫెళాఫెళఫళా ఫెళఫళా
పగిలి పగిలి నిప్పుల కెరటాలై
మంటల సుడిగుండాలై గగనంలో
గిరగిరా- - - గిరగిరా- - - - తిరుగుతుంది
శ్రమజీవుల గుండెలపై చిందులుత్రొక్కే
నిరంకుశ చక్రవర్తులు జీవిత పొలిమేరలు దాటి
పాతాళం అంచులపై సమాధులు కట్టుకుంటారు.
పరపీడన స్వార్థపరత్వాల విషపుకోరలువిరిగి
ఉత్తర దక్షిణ ధృవచక్రాల ఇరుసులో

మరణ శాసనం తీసుకుంటాయి
హిమాలయం శిఖరాగ్రాలు ఫటాలున పగిలి
పాంచజన్యాలై విప్లవ ప్రళయఘోష పుట్టిస్తాయి
సప్త సముద్రాల ఆవలితీరంలో ఆకాశం తలుపుతెరచి
నవయుగ సూర్యుడు
స్వేఛ్ఛాస్వర్ణారుణ కిరణకుసుమాలు వెదజల్లుతాడు
ఆనాడు నా జన్మ భూమి
స్వేఛ్ఛా హస్తాలతో మాతృజగత్తుకు
స్వాగతపత్రం లభిస్తుంది
పచ్చని పైరు చేలు
పసిడి హారతి పళ్ళెరాలెత్తి
ప్రపంచ ప్రజాకళ్యాణానికి
మంగళ గీతాలు పాడుతాయి.

(అభ్యుదయ, అక్టోబర్ 1946)

## 2. అస్థిపంజరం

అదిగో అలాచూడు
ఆ నడి రోడ్డు న అదేదో పడుతూ లేస్తూ
తూలి పోతూ పోతున్న దెచ్చటికో
ఆ నిప్పులు చెరిగే వేడి గాడ్పులో
సుడిగాలి సృష్టించిన ధూళి మేఘాలలో
తేలిపోతూ పోతున్న దెచ్చటికో
అదొక అస్థిపంజరం అదినడిచే అస్థిపంజరం

తిండి దొంగ రాతి గుండెలో
రగుల్కొన్న దురాశాజ్వాలలో
రక్తమాంసాల్ ఆహుతైపోగా
మృత్యు దేవత బలికోసమై
మిగిలి వున్న ఎముకలగూడు !
కరువు రక్కసి కఠిన పాదాల క్రింద
నలిగి పోయిన అనాధుని శిధిలస్వరూపం
మృత్యుదేవత భీకరాట్టహాసం
విల్లువీడిన బాణంలా వెంటాడుతుంటే
బెదిరి పోయి గాలికెగిరే ఎండుటాకులా
పోతున్నారెచ్చటికో
అదిగో అదొక అస్థిపంజరం.
అది నడిచే అస్థిపంజరం.
( అభ్యుదయ **1946** అక్టోబర్, పి. విశ్వనాధ్ పేరుతో అచ్చయింది.)

## 3. ప్రతీకారం

దివాంతాన నాయెదపై నడిచే
నల్లటి నిశ్శబ్దపు నీడల్లో
నిద్రలేని నాకళ్ళు శిధిలజీవితాల
కైవారం కొలుచుకుంటూ
చుక్కల కనుసైగలపై నడుస్తున్నాయి
దూరంగా ఉత్తరాన
కదలని కొండలపై కదిలేకొండల్లాంటి

కారుమేఘాల ఉరుముల్లో ఎక్కడో ఎప్పుడో
కనబడని తీరంలో చెలరేగిన తుఫాను
చేయెత్తి పిలిచింది ఎలుగెత్తి అరిచింది
నడి సంద్రాన సుడి గుండంలో
ఎప్పుడో మునిగిపోయిన ఓడ
కడలి గుండె పగిలించిన బడబాగ్ని లో
ఆకాశం ఆఖరి అంచుమీద గిరగిరా తిరిగింది.
గప్పున వెలిగి ఎప్పుడో రాలిపోయిన
చుక్కొకటి కడలిపై కెరటంలేని కడలిలో
కదిలే తెరచాపల్లాంటి నీరదాలనీడలపై
నిప్పులబాణంలా రివ్వున దూసుకొని పోయింది
ఆకలిఅరుగు మూల చీకటిఒడిలోఎప్పుడో
ఆఖరి ఊపిరి విడిచిన బిచ్చగాడు
పరుగెత్తి,పరుగెత్తే సరీసృపంలో
ఏవో ఏవేవోరకరకాల నెత్తుటి అడుగులుజాడలు
పసిగట్టి బుసగొడుతూవడివడిగా
వెడుతున్నాడెక్కడికో
ఎప్పుడో ఒకనాటి నట్టనడిరాత్రి
పెనుగాలి కెరటంలో కొట్టుకు పోయిన
పూరిగుడిసెల్తో విరిగి ముక్కలైన ఎముకపంజరాలు
గతకాలం సమాధి పెకలిస్తూ జలపాతధ్యానంలా గర్జిస్తూ
శత్రువు శిబిరంమీదికి పోతున్నాయి దూకిదూకి
ఎప్పుడో బీటవారిన బ్రతుకు గోడలవెనుక
ఎవడో ఎగదోస్తున్న కాటిమంటల్లో
పగిలి శకలా లౌతున్న కపాలాలు
పదునెక్కిన పరశువులై

రారాజుల నెత్తుటి కిరణాలు పగులగొట్టి
మరోజగత్తు ముఖద్వారందాకా వంతెనలకు
పునాదులు లేస్తున్నాయి
జీవితరహదారిలో ఏదోఒక పవిత్రాశయంతో
ఎప్పుడో ఒకవిప్లవ వీరుని గుండె
విదిలించిన వేడి నెత్తుటి చుక్క
నిశీథం నొసటి మీద పిడికిలెత్తి
ప్రతీకారం ప్రతీకారం
అంటూ అరుస్తూ వెనుకటి కాలం
విడిచిన కుబుసాల గుట్టమీద
నిదరోయే నా తల్లికి మేల్కొలుపు పాడుతుంది
నిశీథాంతాన
నా కాలినుండి తెగిపడ్డ శృంఖల నినాదంలో
ఉషః కిరణంలా భవిష్యత్తు

(అభ్యుదయ, 1947 జనవరి)

## 4. నవజగత్తు నిర్మిద్దాం

రేయి వేయి రెక్కలు విప్పి లోకం
నడినెత్తి మీద నెమ్మదిగా నడుస్తోంది
నింగి నొసటి మీద నిప్పునెరసుల్లా నిల్చున్న
చుక్కలు ఎవరికోసమో కనుసైగ చేస్తున్నాయి
కాలం కదలని ఎండు మోడులా నింగి

వంక నోరెత్తి చూస్తోంది
నడిసంద్రపు నిశ్శబ్దంలో అరుణోదయం ఎప్పుడో
అంతలో ఎంతమార్పు (!)
భూమ్యాకాశాలమధ్య భయంకర శబ్దం
కడలిగుండెలపై కొండలెన్నో ఫెళఫెళ విరిగి పడిపోతున్నాయి
దిక్కులు దద్దరిల్లి చెవులు మూసుకున్నాయి
పరుగెత్తే పయోధరాల ప్రళయగర్జన
ఆకాశం అదిరిపోతుంది
మబ్బుముసుగుల్లో సంకులసమరం జరుగుతోంది
రెక్కలుతెగిన పిట్టల్లా రాలిపోతున్నాయి-----
ఎన్నో ఎన్నెన్నో చుక్కలు
కటికరాత్రి కలల నిదురలోకం కెవ్వున అరిచింది
మగత నుండి మేల్కొన్న మానవుడే
కాళ్ళు విరిగి వెనక్కి విరుచుకు పడిపోయాడు
కాలం కాలే కొరివిలా నోటనిప్పులు
కక్కుతూ అతని చుట్టూ తిరుగుతోంది
బ్రతుకు బాటవార నిప్పుల పర్వతం
ప్రళయనాట్యం చేస్తోంది
రక్తం---న రక్తం----నవజగత్తు నిర్మించే నవరక్తం
నిప్పుల నగాధరంపై ఇందనమై దగ్ధమై పోతోంది
ఎందరో వికలాంగులు ఎలుగెత్తి
ఏడుస్తూ కడుపులు బాదుకుంటూ
పడుతూ, లేస్తూ తూలిపోతూ
అగాధంలో కుప్పలై కూలిపోతున్నారు
యుద్ధం---అంతర్యుద్ధం---అన్నదమ్ముల అంతర్యుద్ధం
అణువణువు గొంతెత్తి గర్జించాయి

బిగుసుకున్న సంకెళ్ళ గలగలలో నాకన్నతల్లి
కన్నీటిశోకాలు మెల్లి మెల్లిగా వినిపిస్తున్నాయి
కటకటాల సందుల్లో నాతల్లి కుమిలి కుమిలి
ఏడ్చి సంకెళ్ళ నడుమ మూర్ఛిల్లి పడింది

నా బానిస దేశం ఈనాడొక స్మశాన వాటిక
రక్త సంబంధం తెగిపోయింది
అన్నకి తమ్ముడే చితిపేరుస్తున్నాడు
కాలిపోయే కొండల్లో అమాయక
ప్రాణాలు ఫటఫటా ప్రేలి పోతున్నాయి
కుత్తుకలు తెగిన కళేబరం 'శాంతి','శాంతి'
అంటూ ఆరుస్తూ గిజగిజా తన్నుకుంటోంది
కాలేకాటి వెల్గుల్లో తెల్లటి వికృతాకారం ఎగిరెగిరి పడుతోంది
వెక్కిరిస్తూ వికటాట్టహాసం చేస్తోంది
దేశాన్ని రెచ్చగొడుతోంది
చిచ్చులోకి లాక్కు పోతోంది
ముందుకు పోతే కత్తుల వరం
వెనక్కి పోతే నిప్పుల సుడిగుండం
దిక్కులేని నా దేశం గిలగిలా తన్ను కొంటోంది
దిక్కులేని నా ప్రజల ఆహాహాకారం చేస్తోంది
ఉరి కంబాల మాటున శత్రువు
కత్తికి పదునెక్కిస్తున్నాడు
సంకెళ్ళు బిగదీస్తున్నాడు
మతపిశాచాల మచ్చిక చేస్తున్నాడు
కత్తి మెరుపుల్లో కదంత్రొక్కే మతోన్మాది

మానవత్వం భగ్గున మండి బూడిదైపోతుంది
వెనుకటి వీరోచిత చరిత్ర
ముక్కలై చెక్కలై చెదిరిపోతుంది
తెగిన శిరస్సుల గుట్టలో
భవిష్యత్తు ఊపిరాడక మూల్గుతోంది
మానవుడా ! అలాచూడు !
నీ సోదరి... నట్టింట్లో .... భర్త ఎదుట
భగ్నశీల.... వలవలా ఏడుస్తోంది
తెగిన పుస్తెల పేరు దుమ్ములో కలిసి పోయింది
మనకిది శుభంకాదు
మనకిది మేలుకాదు
ఇది స్వాతంత్ర్య సమరంలో విషాద ఘట్టం
శవాల గుట్ట మీద శత్రువు శిబిరంలో
పండుగ దినం జరుగుతోంది
మానవుడా ! చరిత్రతెరలోత్తిగించి చూడు
ఎర్రటి రక్తాక్షరాల్లో.... మెరుస్తోంది.....
'ఖిలాఫత్' (!) హిందూముస్లిం
రక్తం నిప్పుల బాణంలా పగవాడి
గుండెల్లో దూసుకు పోయిందా రోజున
నాకన్నతల్లి ఆనందాశ్రువులు రాల్చిందా రోజున !
పగవాడి కోటగోడ గజగజవణికిందా రోజున
మానవుడా ! మనదొక మహోజ్వాల వీరోచిత చరిత్ర
కళంకితం చెయ్యబోకు !
అహో ! అదో ! అదిగదో !
చీకట్లను చీల్చుకుంటూ రివ్వు రివ్వున
రెక్కలాడిస్తూ వస్తున్నది

మెరపు తీగ..... ఆకలి అంచులపై
తిరిగే మరచక్రం వస్తున్నది
ఎడారిలో బయాసిస్‌లా వస్తున్నది
ఉరికివురికి వస్తున్నది
కార్మిక హృదయం పడగెత్తి బుసకొడుతోంది
కలహ పిశాచాల పికలు నొక్కేస్తున్నది
బానిసలకు భేదం లేదంటూ
ప్రతీకారం ప్రళయాట్ట హాసం చేస్తూ
శత్రువు శిబిరం మీదికి దూకి దూకి పోతున్నది
అదో .... అలా చూడు కదన భూమికే కేస్తున్నది
ఎత్తిన సుత్తీ కొడవళ్ళై పీడిత లోకం
ముందుకు పోతున్నది
నల్ల గొండ నడిగడ్డ మీదే
నైజాం సామ్రాజ్యానికి సమాధిగట్టేస్తున్నది
అదే అదే నవసమాజ హర్మ్యానికి మొదటిమెట్టు
నిరంకుశుల శిరస్సులే తెగనరికేస్తూ
నింగిమీద నవపతాక నిలుచున్నా
దదిగో మానవుడా ! గతచరిత్ర మరచిపోకు !
మగత నుండి మేల్కోవోయ్!
కార్మిక లోకం అభయహస్తం చాచింది
నీ వెనుకే నడుస్తోంది
మనమంతా బానిసలం మతంలేని మానవులం
మనరక్తం... నవజగత్తు నిర్మించే మనరక్తం...
నిరర్థకం కాకూడదు లోకానికి అనర్థకం కాకూడదు
కన్నతల్లి కంఠశోష వింటున్నావా

ముందొస్తున్నది జీవన్మరణ సంగ్రామం
పగవాడి నెత్తుటి రాచరికంలో
చరమాంకం జరుగుతోంది
మనపొట్టకూటి పోరాటంలో
ప్రథమాంకం జరుగుతోంది
మానవుడా ! మత్తువీడి ముందడుగెయ్
మనమంతా ఒకటేఒక హృదయ స్పందనంలో
ఒకటే దీర్ఘ నిశ్వాసంలా జగమంతా ప్రసరిస్తూ
ప్రత్యణువులో ప్రతిధ్వనిస్తూ
పగవాడి కోటగోడ పునాదులే పెకిలిద్దాం
కన్నతల్లి కన్నీళ్ళు కార్చినచోటే
శత్రుశిరస్సు నరికేద్దాం ! నవజగత్తు నిర్మిద్దాం!

(-హసన్‌పేరుతో అభ్యుదయ, 1947 జనవరిలో)

## 5. నవ్యగీతాలు

కడలెరుగని కాలస్రవంతి కల్లోలిత కెరటాలు
అంచులపై కదిలి కదిలి నా నేత్రాలు నవ్య గీతాలల్లుతాయి

★ ★ ★

నవయుగ నీలాంబరంలో నవ్యారుణ కిరణకాంతి
మధురప్రసారంలో మురిసి మురిసి.
నా నేత్రాలు నవ్య గీతాలల్లుతాయి

★ ★ ★

నియంతృత్వ రాచరిక చక్రాల

అట్టడుగున అణగారిన
నా జన్మ భూమి నిట్టూర్పు రొదలోన
కరిగికరిగి నా నేత్రాలు నవ్యగీతాలల్లుతాయి

★ ★ ★

రాబోయే రోజుల్లో
ఒకరినొకరు పీడించని
ఒకరినొకరు పాలించని
స్వేచ్ఛా జీవిత ఆశల వీచికలో
కులికి కులికి నా నేత్రాలు
నవ్య గీతాలల్లుతాయి.

(ఆనందవాణి 25-5-1947)

## 6. స్వాగత గీతం

పడిన విష వృక్షం నీడలపై నీలిమంటలలో కెవ్వుమన్నది
శత్రువు తుది విశ్వాసం సంకెల తెగిపడినచోట
నరుడొక నగ శిఖరమై లేచినాడు
అమ్మా! గతజీవిత శిథిలాలపై
విడిచిన అడుగుజాడలో వినపడే విషాద గీతిక
విజయ ఘోషకై నీ పెదవి దాటినది
బ్రతుకు పైట మృత వీరుని పెదవిలో ప్రతిధ్వనులై
జయధ్వానమై జలధారలూగించినది
అమ్మా! అటుచూడు రేయి చివర
రెక్క విప్పిన పసిడి మబ్బు
వార్ధికి వారధి గట్టినవే!

జగతి గుండె జలదరించి జై గీతం పాడినదే !
ఆకసమొక ఆనందాశ్రువై
నీ కనురెప్పలలో ఆశలల్లినదే !
కాలం నీ నుదుట కుంకుమరేకై నిలిచినదే!
కొమ్మకింద కదిలే ఉదయానిల వీచిక
రాబోయే సుఖదినాల చేతులెత్తి పిలిచినదే!
అమ్మా!
ఒడ్డు కొచ్చిన కడలి కెరటం
నడిచిన - నిశ్వాసపు నిశ్శబ్దం
లేమిలేని లోకానికి
స్వాగత సంగీతం.

(అభ్యుదయ, 1947 ఆగష్టు)

## 7. సూర్యుని ఆత్మహత్య

ఏడూ ఏడు నిమిషాలు
వికసించిన కుతూహలాల మీద వికాసంగా నడుస్తున్నా
చూడాలని నిజాలను చూడాలని
ఇంతక్రితం చూడని జీవితాలను చవి చూడాలని
నా కవితలో కొత్త కొత్తవిత్తనాలను వాడి చూడాలని
మిషలో నిమిషాలమీద నడుస్తూ పొగ విడుస్తూ
పొగలో వ్యూహాలు విడుస్తూ నుసిరాలుస్తూ
నుసిలో అక్షరాలు రాలుస్తూ నడుస్తున్నా
అదిగో అలావెళ్ళి ఆ గోడ వెనక్కి వెళ్ళి చూడు

చుట్టూవున్న చెదరంలో పచ్చగా పసిరెక్కిన నీళ్ళలో
నీడలు విడిస్తూ జడుస్తూ నడుస్తూ వస్తారు
అరచేతిలో మృత్యువును చూస్తూ యాచిస్తూ వస్తారు
దుమ్ము లో కలుస్తూ ఎదురవుతారు
కుష్ఠులు, రోగిష్ఠులు, దుఃఖాలమీద ఈదుతూవస్తారు
తిండికి తడుముకుంటూవస్తారు
ఉచ్ఛిష్టాన్ని ఊడుస్తూ రాళ్ళను తింటూవస్తారు
పొగలో కలుస్తూ ఎదురతారు సేవకులు శ్రామికులు
అదే అదే అక్కడే ఆ గోడ కిందనే
నీళ్ళలో ఇళ్ళలో నివసిస్తారు
కళ్ళలో నిప్పులూదుతూ కురూపంగా వస్తారు
అనుక్షణం అవాంతరాలను దాటుతూ
నీతినీ నియమాన్నీ జవదాటుతూ వస్తారు
దోషాలతో ముస్తాబై రాత్రిలో
కలుస్తూ ఎదురవుతారు
చోరులు వ్యభిచారులు అంతా ఎక్కడ ఏ సందులో
సోదా చేసినా అంతే అటూ ఇటూ తచ్చాడుతూ వస్తారు
అడియాసల మీద నడుస్తూవస్తారు
ఊగుతూజోగుతూ ఎదురవుతారు
కాళ్ళ కింద కైవారంలో కెవ్వున అరుస్తూ
అగాధంలో అదృశ్యమవుతారు
అంతే అంతే ఎక్కడ ఏ గవాక్షం తెరిచినా అంతే
పో వెళ్ళిపో ధూళి ధూసరితమైన దేహాన్ని విడిచి వెళ్ళిపో
రేపు నువ్వూ అంతే, నేనూ అంతే, అందరూ అంతే
పాపం వృద్ధుడు
కళ్ళ నీళ్ళలో తడిసిన బుతువులను

ధరించిన వృద్ధుడు
ఏడూ ఏడు నిమిషాలు ధరించాలని
పాపంలో వికసించిన పద్మాలను ధరించాలని
లోకం రహస్యాల నవధరించాలని
సాయంత్రం మీద యంత్రంలా యాత్ర సాగిస్తున్నా
'నిన్న పచ్చగా నడిచిన వాణ్ణి
అరంగుళం ఆదరణ అరతులం ఆనందం'
పాపం మానవుడు
చినిగిన చొక్కాలో ఎదురైన మానవుడు
ఆపదలో ఆయుర్దాయాన్ని లెక్కవేస్తున్న మానవుడు
తీగలపై వాలిన వాయసాన్ని చూస్తూ నడుస్తున్నా
'బాబూ గుక్కెడు కరుణ
 గుప్పెడు కనికరం'
పాపం బిచ్చగాడు
కళ్ళులేని కాళ్ళులేని బిచ్చగాడు
ఆకూ అలం తిని బతుకుతున్న బిచ్చగాడు
వీధి మొగలో నల్లగా నలుపెక్కిన నీళ్ళలో
వరాహం మూలుగును వింటూనడుస్తున్నా
'నిత్యం అనిత్యాల కోసం
ఇంకా ఎందుకలా దేవులాడుతావు
క్షణం క్షణం క్షణభంగురాల కోసం
ఇంకా ఎందుకలా ఉబలాట పడతావు
రేపు తుఫాను వస్తోందని పాపం బద్దలవుతోందని
నీ ఆశలన్నీ తుడుచుకు పోతాయని
నీలో అంతరాంతరంలో
ఒక ధ్వని వినిపించడం లేదూ

ఒక దృశ్యం కనిపించడం లేదూ
రా ! ఇలారా
ఒక క్షణం ఈ నీడలో నిలుచుందాం
ఒక క్షణం లోకాన్ని మరిచిపోదాం
చూడు మైదానం చూడు
చుట్టూ రక్తసిక్తంగా వేలాడుతున్న
సూర్యుని అవయవాలను చూడు
నీళ్ళలో నీడలు వెతుక్కునే చెట్లక్రింద
నీలంగా కదులుతున్న ఆకారాలను చూడు
ఏవో ఉచ్చరిస్తూ ఎవరినో ఆరాధిస్తూ
మృత్యువును మకరందంలా తాగుతున్న
హస్తాలను చూడు
ఇదే అంతం, ఇదే అస్తమయం
రా పోదాం, వెళిపోదాం
శూన్యంలో శిబిరంలో దీపం వెలిగించుతూ
నిశ్శబ్దంలో నిరామయంలో సంగీతం వినిపించుతూ
వెళిపోదాం చనిపోదాం'
పాపం పిచ్చివాడు శుష్కించిన శరీరాన్ని
రక్కి తింటూ వున్న పిచ్చివాడు
ఏడూ ఏడు నిమిషాలు
మనోరథాన్ని దిగి ఒంటరిగా నడుస్తున్నా
ఇంకా ఒక ఫర్లాంగులో ఉన్నది రాత్రి
ఎండిన చెట్లుక్రింద ఎవరి కోసమో
ఎదురు చూస్తున్నవి రెండుకళ్ళు
దోషాలను విప్పుతూ నవ్వుతున్న కళ్ళు
సగం చచ్చిన శరీరాన్ని లోకానికి అప్పగించిన కళ్ళు

చిట్లిన మౌనాన్ని తిని బ్రతుకుతున్న కళ్ళు
కళ్ళ నీళ్ళలో దీవులు
వంతెనక్రింద నీళ్ళలో దీపాలు
ధూళినిండా భయం వికసిస్తున్న వాసన
దూరాన మినుకు మంటూ వీధిలాంతరు
సిగ్గును జారవిడిచిన రాత్రులకు
సాక్షిగా నిలబడిన వీధిలాంతరు
ఏడూ ఏడు నిమిషాలు.

(ఆనందవాణి, 1948)

# 8. కుశల ప్రశ్న

ఓహో నువ్వా ఎప్పుడు ఎలాగ ఏంచేస్తున్నావు
ఏ నక్షత్రం కింద సంచారం చేస్తున్నావు
ఏ రుతుపవనాల మధ్య నివాసం చేస్తున్నావు
జీవితాన్ని ఎటువైపు ఏ రోడ్డు వైపు ఏ రకం రోజులవైపు
నెట్టుకు వెళుతున్నావు
ఇంకాఅక్కడేనా, ఆవూళ్ళోనేనా
ఉద్యోగం చేస్తున్నట్టేనా
జీవితం సవ్యంగా సాగుతున్నట్టేనా
షష్ట తారీఖు మహత్యం మెరుపుతీగసామ్యంగా లేనట్టేనా
జీవితంలో మూడో అధ్యాయం తెరుచుకున్నదా
ఇల్లూ ఇల్లాలూ అంటూ ఓదిక్కు ఏర్పడ్డాదా
గోడమీద శ్రీకృష్ణుని పటం పుష్పాలంకృతంగా ఉన్నదా
ఇష్టకార్యసిద్ధి చేకూరుతున్నదా
హఠాత్తుగా విషవాయువులు వీచడం కానీ
అర్ధరాత్రి ఆగంతకుడు భయంకరమైన వార్తనేదో
మోసుకు రావటం గానీ
ఇక మీద నీ నివాసం పేకమేడల్లోనే సుమా అని
భయపెట్టడం గానీ
ఇల్లాలు ఆకర్ణాంత నేత్రాలతో కన్నీరు రాల్చటంగానీ
వగైరా వైపరీత్యాలు నిన్ను వెంటాడటం లేదుకదా
నిత్య అమావాస్య నీకు ఉపమానం కాదు కదా
ఐతే సరేకదా! మరి నువ్వు చూస్తూనే ఉన్నావు కదా
రాజ్యంలో ఎటుచూసినా కారు మేఘాలు
పేరుకు స్వాతంత్ర్యంగాని పేరు వెనక ప్రత్యక్ష నరకాలు

కన్నీళ్ళ ప్రక్కన సేదతీర్చుకునే కుటుంబాలు
ఎక్కడ ఏ గవాక్షం తెరిచినా ఇవే దృశ్యాలు
అని సముద్రఘోష చేసే కంఠాలు క్షణానికి వెయ్యి
ఒక వైపు సత్యాహింసలని ఆవిష్కరించే చెయ్యి
మరో వైపు నీ ఆశలని భూస్థాపితం చేసేందుకు
సిద్ధంగా ఉంచబడిన గొయ్యి
మరి రాజ్యం ఇంత దుర్గతిలో ఉందికదా
జీవితం ఇంత అధోగతిలో ఉంది కదా
ఇందుకు సాధనోపాయం చూసుకున్నావా
దీపం ఆరకముందే ఇల్లు చక్కబెట్టుకునే కిటుకు తెలుసుకున్నావా
వేమన పద్యాలు కంఠస్థం చేశావా
ఏమో ఏం చెప్పగలం?
ఎక్కడ ఏ రోజు ఏ విపత్తురానున్నదో ఎలా చెప్పగలం
పాపంయొక్క మేరు పర్వతం ప్రక్కన నుంచుని
నిర్ధారణగా ఏ మాట చెప్పగలం
ఆకాశాన్ని ఎలా నమ్మగలం
ఏదైతేనేంలే ఈ క్షణానికి సంతోషంగా ఉన్నావు అదేచాలు
నా మిత్రుడొకడు సుఖంగా ఉన్నాడు అదే నాకు పదివేలు.

(ఉదయిని, 15.1.1952)

# 9. న్యూస్‌రీల్

హంతకుని అరచేతులు ఎరుపు
వంచకుని మాటల తెరల వెనుక
పడగ విప్పిన విషసర్పాలు ఎరుపు
అరమోడ్పు కన్నులలో విద్రోహ వెన్నెలకిరణాలు ఎరుపు
చైనా అధినేత మావో కనుబొమల కొమ్మలపై
ఘృతేళికలు మరీమరీ ఎరుపు
ఎర్రదనం రాజకీయ విద్రోహానికి గుర్తు
ఎర్ర జెండా మిత్ర భేదానికి గుర్తు
చైనా చరిత్ర అనే చీకటి నికర్షణంలో
ఎటు చూసినా నెత్తురు మడుగులే
నెత్తురు మడుగులో ఉద్భవించినది
కమ్యూనిజం అనే కమలం
భాష్య కారుడు ఎవరైతేనేం
మనిషి కన్నీళ్ళను చషకాలలో నింపుకుని
తాగడంలో అంతా ఉన్మరిష్ణువులే
ఫాసిజం కోరలు తీసిన పులి
మావో కమ్యూనిజం దాన్ని ఉపాసిస్తున్న నెచ్చలి
స్నేహాన్ని ఉచ్చరిస్తూనే
కంఠాన్ని ఉత్తరించడం పెకింగ్ పండితుల ప్రత్యేకశైలి
చైనా నిఘంటువులో శాంతి అనే మాటకు
అర్థ వివరణం వేరు
యుద్ధ పర్వంలో అపశృతి
లేదా మారణ హోమానికి ముందు
రాక్షసుడు ఒళ్ళు విరుచుకుంటున్న విశ్రాంతి

మార్మిప్రష్ట మేఘాలు మిధ్యాకుసుమాలు
వినా మరిదేన్నీ వర్షించవు
దివాస్వప్నాల వల్ల కడుపు నిండుతుందా ?
తుపాకులు ఆకలి తీర్చలేవు కదా !
ఆర్థిక స్వర్గారోహణం నించి హఠాత్తుగా నేలకూలడంతో
ఆసియా ఖండాన్ని వొలుచుకు తినడానికి
ఉద్యమించారు చైనావాళ్ళు
క్షుధార్తి చల్లార్చు కోడానికి ఇండియా అక్షయపాత్ర
దాన్ని ఆక్రమించుకున్న వారంతా నిద్రాళువులు
సీతాకోక చిలుకలను సిల్కు దారాలతో ఉరితీయడమన్నా
అతనికి చాలా యిష్టం
ప్రధాని చౌఎన్ లై అంతర్జాతీయరంగంలో ఆటబొమ్మ
అరమోడ్పు కన్నుల వెనుక అంతస్సు రగులుతున్నా
అందంగా అరవిందంలా నవ్వడం
అతని రాజకీయ చ్ఛందస్సు
చైనా ఇకనుంచైనా తన చెయిదాన్ని
మార్చు కుంటుందని అనుకోవచ్చునా ?
ఖచ్చితంగా చెప్పడం కష్టమే
ప్రతీకార జ్వాలలో మెరుస్తున్న నా హృదయాన్ని
ఏనాడో యుద్ధరంగానికి బట్వాడా చేశాను.
(జ్యోతిమాసపత్రిక, మార్చి 1963)

# 10. జెండాలకు కన్నీళ్ళులేవు

జెండాలకు కన్నీళ్ళు లేవు
ప్రభుత్వ కర పత్రాలలో ప్రతిష్టించిన అమెరికా ప్రజాస్వామ్యానికి
మళ్ళీ మరొక జీవిత కాలం జన్మఖైదు విధించారు కదామరి

జెండాలకు కన్నీళ్ళు లేవు
రాక్షసుల స్వప్నాలకు దయాదాక్షిణ్యాలు లేవు
చరిత్ర పునరాగతిలో రక్తసిక్తమైన అమెరికా చిత్రపటంమీద
గొంగళీ పురుగుల సైనిక విన్యాసాలు వినా
మరేవీ కనపడవు ఇప్పుడు
(ఆఫ్రికాలో అడవి జంతువులకన్నా టెక్సాస్‌లో
గొంగళీ పురుగులు భయంకరంగా ఉంటాయుట)

జెండాలకు కన్నీళ్ళు లేవు
నరక ద్వారాలను విస్తృతం చేసే హస్తాలకు దయా దాక్షిణ్యాలు లేవు
లింకన్ తో ప్రారంభ మైన హత్యాకాండ మళ్ళీ మరొక లింకన్ జీవితాన్ని
భూస్థాపితం చేస్తేనే గాని రక్తదాహం చల్లారలేదు కదామరి
ఈలోగా అమెరికా అంతశ్శత్రువులకు
స్ట్రెయిట్ జాకెట్ల లో బంధించిన యుద్ధోన్మాదులకు
నిండా నూరేళ్ళు ఆటవిడుపు

జెండాలకు కన్నీళ్ళు లేవు
జాత్యహంకారానికి దయాదాక్షిణ్యాలు లేవు
ద్వితీయ ప్రపంచ యుద్ధావశేషాలు నిర్మూలనం
కాలేదనడానికి చిహ్నంగా

బెర్లిన్ గోడపై ఇంకా ఇప్పటికీ
విషవాయువులు వీస్తూనే ఉన్నవి
ఆగ్నేయాసియాలో అగ్నిగుండాలు రాజుకుంటూనే ఉన్నాయి
దక్షిణ వియత్నాము సరిహద్దులలో
ఎందరు ప్రేమికులు ఆత్మహత్య చేసుకుంటున్నారో
ఎందరు తల్లులు పుత్రశోకంతో దగ్ధమౌతున్నారో
అప్పుడప్పుడు వార్తలు వింటూనే ఉన్నాం కదా !

జెండాలకు కన్నీళ్ళు లేవు
డాలర్ రాజకీయాలకు దయాదాక్షిణ్యాలు లేవు
శృంఖలాబద్ధమైన హస్తాలు ఎవర్ని రక్షించగలవు ?
అవమానభారం క్రుంగిన ఆకాశం మీద
నిండుగా నిబ్బరంగా మళ్ళీ సూర్యుడు ఉదయించడం ఎప్పుడు ?

నీగ్రోల సంగతి సరేసరి
ట్రిగ్గర్లే ఇక్కడ అన్నింటికీ సమాధానం

జెండాలకు కన్నీళ్ళు లేవు
పుష్‌బటన్ రాజకీయ వేత్తల ట్విస్ట్ సంగీతానికి
దయాదాక్షిణ్యాలు లేవు
'మానవుడు ఎక్కడవున్నా ఒకటే
పుట్టుకతోనే అతడు స్వతంత్రుడు'
మనసారా ఈ మాట అన్నందుకు
ప్రెసిడెంట్ కెన్నెడీని నడివీధిలో హత్యచేశారు
అమెరికా నెన్నొసట నిప్పులు చెరుగుతున్న ఈ పుండు
ఎన్నటికీ మానదుకదా !

జెండాలకు కన్నీళ్ళులేవు
హ(రర్ కామిక్స్ నాగరికతలో మానవుడే మృత్యువు

(కెన్నెడీ మరణం మీద కవిత, నవత-2, ఏప్రిల్ 1964)

## 11. కొత్త సంవత్సరం

కన్నులతో కాదు గడియారాలతో చూడు
నా రూపాన్ని నీవు చూడవచ్చు
అంకెలమధ్య అక్షరాల మధ్య
గోడకు వేలాడిన కాగితాల మధ్య
మోసుకొచ్చే ఉత్తరాల మధ్య రాలిన రోజాల మధ్య
బద్దలైన అద్దాల మధ్య ఎలక్ట్రిక్ స్తంభాలపైన ఎ(రని -
అపాయాల మధ్య చెట్లకింద సకుటుంబంగా తారసిలే -
సంతా పాల మధ్య సంకెళ్ళ మధ్య
ఎ(రటిపుల మధ్య ఎలక్షన్ పవనాల మధ్య
రాక్షసుల పేరోల గాల మధ్య
నగరం అవయువాల లోపల -
నయంకాని గాయాల మధ్యనలభైకోట్ల పేదవళ్ళ -
గుడిసెల మధ్య సూదుల మధ్య
డిశెంబర్ సంధ్యల మధ్య సూర్యుడురాని రోజుల మధ్య
గ్లాలేని రా(తుల మధ్య నిట్టూర్పులు నిస్పృహలూ -
పుష్కలంగా లభించే - రుతువుల మధ్య
నీ కంఠం నువ్వే ఉత్తరించుకుందావనుకున్నక్షణాల మధ్య

కుట్రల మధ్య సైతాన్ల మధ్య
ఛద్మవేషాల మధ్య నరకానికి వెళ్ళే రథ్యాల మధ్య
భయాలనీ బీభత్సాలనీ - చూపించే సారంగాల మధ్య
నీడలో నీడలా నిన్ను వెంటాడే -
దగాల మధ్య చిల్ల పెంకుల మధ్య
అప్పుడే పెదవి దాటిన -
ప్రాణ వాయువుల మధ్య పొగసహస్ర ముఖాలతో -
ఎదురయే పరిసరాల మధ్య
కుక్క గొడుగులు, కళ్ళూ కాళ్ళూ -
లేని ఆకారాలుతప్ప మరేం -
కనిపించని గవాక్షాల మధ్య
సాలీళ్ళమధ్య తెల్ల జిల్లేళ్ళ మధ్య
తురాయి పువ్వుల్ని తొడిగిన
రావి చెట్ల మధ్య
కండ చీమల కుత్కీలాల మధ్య
నీకూ ని నీడకూ మధ్య

('సిందూరం' కవితా సంకలనం, డిసెంబర్, 1974)

డా॥ సుమనశ్రీ

# నీడ ఒక నిశ్శబ్దం


మసక చీకట్లో మంచూ, మంచు వెనకాతల
అక్షరాలా అనాదిగా నిల్చున్న అస్పష్ట ఆకారం
పద్య శరీరపు ఆచ్ఛాదనే కవిత్వం కామోసు
నీడల మధ్య నిశ్శబ్దాన్ని కొలవగల అక్షరాలు దొరికాయా నీకు
సామ్రాజ్యాలు సామ్రాజ్యాలే నీ పాదాక్రాంతమై
నీ పద్య పాదాల మధ్య లయమైపోయాయా
నీవొక శతఘ్ని విడిచిన ప్రచండ మారుతానివి
నీవొక అల్ప ప్రాణిని కూడా అందలమెక్కించగల ఐరావతానివి
నీడ ఒక నిశ్శబ్దం గోడ ఒక కాల సముద్రం నిలబెట్టిన స్థూపం
చిమ్మెటలన్నీ పోగై కాలపు చివరిక్షణాల్ని ప్రవచించినా
చెక్కు చెదరని శిల్ప శరీరం నీది
మృత్యువు ఎక్కడో లేదు నా ప్రక్కనే
అతని చిరునవ్వు కోసమేగా నేను
గంటలు గంటలు వేచిచూస్తుంటాను
రోడ్ల వాహనాలమీదుగా అతగాడి
వీరవిహారాన్ని గమనిస్తూనే ఉంటాను
ఒక్కోసారి అతగాడు నా భుజాలమీదికి ఎక్కి కూచుంటాడు
విశ్వ రహస్యాన్ని విప్పి చెబుతున్నట్లు
నా చెవుల్లో గుసగుసలు పోతాడు.
నా నేత్ర పరిధిని విస్తృతం చేసే నేర్పుగల
మృత్యువును ప్రేమించకుండా ఉండగలనా
పద్య శరీరాన్ని నిమరకుండా
ఒక్క క్షణమైనా నిద్రించగలనా

(ఆంధ్రజ్యోతి 'సాహిత్యవేదిక', 23 ఫిబ్రవరి, 1998)

నది వేసవి - అజంతా
-----------------------
ఒంటరిగా కూర్చున్నాను గదిలో
ఎవరో కత్తులు విసురుతున్నారు హృదిలో
కిటికీ ఆవల పూలతోటలో హంతకుడు
తెరుచుకుంటున్న ఆలోచనల కత్తుల బోనులలో
మధ్యాహ్నసుందరి మండుతున్న వేసవి మంటల గుబురులలో
ఆకలి ఆకారంలో పెద్ద పులి
ఒంటరిగా కూర్చున్నాను గదిలో
ఎవరో సమాధి నిర్మిస్తున్నారు హృదిలో
కిటికీ ఆవల
సూర్యుని నఖాంకుశాల ఆవల
క్షుద్రదేవత పరిరంభం ఆవల
విషవృక్షాల నీడలలో
ఎవరో నన్ను పోలిన విషణ్ణుడు
ఒంటరిగా కూర్చున్నాను గదిలో
భీభత్సం అనేక రకాలు

# ఆవిష్కరణ





ఘూర్ణిల్లుతున్న విషాద వృక్షచ్ఛాయలలో
అదృశ్య లోకాలను ఆవిష్కరిస్తున్న స్వాప్నికుడా
నేను నీ కన్నీళ్ళలోనే ఉన్నాను
నిషిద్ధ నగరంలో నీ ఆక్రందన ఎన్నోసార్లు విన్నాను కదా
నీ గది గోడలపై అగ్ని చక్షువు నేనే

నడి రాత్రి నడివీథి స్వప్న కవాటాలు తెరుస్తున్నారు
ఎవరో

నవ్వుతున్న పెద్ద పులి కావచ్చు
అరణ్య కుసుమాలు వెదజల్లుతున్న పరివ్రాజకుడు
కావచ్చు
కాల మేఘాలంకృతుడైన మృత్యురథచోదకుడు
కావచ్చు

నడి రాత్రి నడి వీథి అలజడి సృష్టిస్తున్నారు ఎవరో
నడుస్తున్న శిలా విగ్రహం కావచ్చు
చీకటి సోపానాలపై సాలభంజిక హెచ్చరిక కావచ్చు
జీవన సంకేతాలను దగ్ధపటలం చేస్తున్న
విద్రోహి క్షుద్ర విన్యాసం కావచ్చు

నడి రాత్రి నడి వీథి మృత్యు రేఖపై నగ్న తాండవం
చేస్తున్న స్వాప్నికుడా
జ్వలిస్తున్న కన్నీళ్ళలో ప్రతిఫలిస్తున్న ప్రతిబింబం
నీదేనా

చీకటి వెన్నెముకపై ప్రతిష్ఠించిన నగరంలో మనిషి
చిత్ర వధ ప్రత్యేక కళ
కలలలో సైతం అతడు శృంఖలుడే.

అజంతా